

# ఏడుకొండలవాడా! వెంకటారమణా!

కడుపు నిండా కమ్మని భోజనం పెట్టి, మూడేళ్ళ ముద్దుల కొడుకును—నిద్ర పుచ్చుతోంది ఆదెమ్మ. పదేళ్ళ కాపురం ఫలితం, పనస తొనలాంటి పుత్రుడు—ఆమె ప్రాణాలన్నీ ఆ పిల్లవాడిపైనే!

ఎండ మిడిసి పడుతోంది—బిచ్చగాని కడుపులో అగ్ని పర్వతం వలె.

ఇంటి ముందు ఖాళీస్థలంలో సన్నకోణా మణి వడ్లు ఎండబోసి ఉన్నాయి. ఆ వడ్ల దగ్గరకు రెండు కాకులు చేరాయి. ఇంటి చుట్టూ పెట్టని గోడలా ఏర్పడ్డ చిల్లకంప చెట్ల నీడలో-మత్తుగా నిద్రబోతుంది ఇంటి కుక్క.

ఆదెమ్మ గారాబు బిడ్డడు నిద్రబోయాడు కాని ఆమె చేతులు పిల్లవాని వీపు మీద మృదువుగా ఆడుతూనే వున్నాయి. ఆమె ఆలోచనలు సరిహద్దులు దాటి సంచరిస్తూనే ఉన్నాయి.

పక్కింటి ఇల్లాలు వెంకటలక్ష్మి పెరటి దొడ్డి గుమ్మంలోంచి ఒక్క పరుగునవచ్చింది ముక్కు గోళ్ళు ఎగరేసుకుంటూ. ఊళ్ళో పిచ్చుక సమర్తాడినా-మరుక్షణం ఆమె చెవులకు సోకుతుందా వార్త. లోకంలో జరిగే వార్తలకూ, విశేషాలకూ ఆమెకూ అంతదగ్గరి సంబంధం. ఆమె దూకుడు చూస్తే ఏదో వింత వార్తను కడుపులో కుక్కుకోలేక బాధపడుతున్నట్టుగా కనబడుతోంది. వాకిట ముంగిట్లోనే వుండి గొంతు సారించింది.

"ఏఁవమ్మా! ఆదెమ్మా! ఈ సంగతి విన్నావుటమ్మా!"

కునుకుపాటులో త్రుళ్ళిపడ్డట్టు-ఆదెమ్మ ఆలోచిస్తూ త్రుళ్ళిపడింది.


"రా, వొదినా కూర్చో. ఏమిటీ విశేషాలు?" అన్నది ఆదెమ్మ చిరిచాపపరుస్తూ

వెంకటలక్ష్మి చాపమీద తాపీగా చతికిలబడి-'ఆదెమ్మా! ఒక్క రహస్యం. నీకడుపులో నువ్వేదాచుకోవాలి. నీమంచికోసమే చెబుతున్నా, నేనిట్లా అంటున్నానని ఏమీ అనుకోకు. పోయిన బేస్తవారం నాడు మనవూరిప్రక్క కేశవాయపాలెం లేదూ, ఆ పాలెపుకరణం గారింట్లో దొంగలు పడ్డారుట. భార్యమె లోని గోవర్ధనపు గొలుసు చేతులోని మూడు జతల వొంకెల గాజులూ—తీసి కెళ్ళారుట తెలీ లేదూ!

"ఆ! ఆ! తీసికెళ్ళితే—"

"దొంగల ఆచూకే తెలియలేదనుకో. కాని కరణంగారిభార్య నాలుగేళ్ళ క్రితం పెద్ద జబ్బుచేస్తే—ఏడు కొండలవాడికి అనగల్ని నిలువు దోపిడిగా సమర్పిస్తానని మొక్కుకున్నదట తెలీ లేదూ! అటువంటి నగల్ని దొంగిలించడం మహాపాతకం. ఏడు





కొండలవాడికి ఎంతైనా ఆగ్రహం కలగొచ్చు. ఏడుకొండలవాడికి ఆగ్రహం కలిగిందంటే— సాక్షీగా బ్రతకటం కష్టం ఆదెమ్మా! నువ్వేమీ అనుకోకు. మీ ఆయన యీచుట్టుపక్కల దొంగతనానికి పేరు మోగాడు. ఈ దొంగతనంలో మీ ఆయనకేమైనా సంబంధం వుందేమో కనుక్కో. అంతే! నేను యింత తెగించి వాగుతున్నానని నొచ్చుకుని ప్రయోజనం లేదు. అంతా మీ మంచికే"

ఆదెమ్మ ముఖం ఆలోచనలతీవ్రతలో గంభీరమైంది. తనభర్త గజదొంగే! ఆ సంగతి అందరికి తెలుసు. నాలుగుసార్లు జైలుకి కూడా పోయి వచ్చాడు. ఇంకా ఆవృత్తి మానలేదు తనుఎన్ని మొత్తుకున్న—తనమాట మీద లక్ష్యం లేదు. ఆయన్నిగురించి తనకు దినదినము గండమే! తనేం చేయగలదు? ఎన్నిసార్లు జైలుకి వెళ్లినా, చచ్చేట్టు తన్నులు తిన్నా, చీవాట్లు వేసినా—ఆయనకు బుద్ధి మళ్లి లేదు? ఏమో కేశవాయపాలెం కరణం గారి భార్య నగలు దొంగిలించటంలో ఆయనకు సంబంధం వుందేమో! అదే నిజమైతే- బ్రతుకంతా బుగ్గి అయినట్టే! తనస్వామి, తన దేవుడు, తన కష్టాల్ని ఆదుకొనేవాడు తిరుపతి వేంకటేశ్వరునికి అపచారం తలపెట్టటమా? నిలువు దోపిడిగా మొక్కుకున్న నగల్ని తనభర్త దొంగిలించటమా! అట్లా ఎన్నటికి జరుగరాదు. అది కుటుంబానికే వినాశకరం.

పక్కింటి ఇల్లాలు వెంకటలక్ష్మి ఆ విషయం ఇంకోయింటికి చేరవేయడానికి చప్పున వెళ్లింది.

ఆదెమ్మ మొగుడికోసం కనిపెట్టుకు కూర్చుంది ఆ సంగతి చెవిలోపడ్డ దగ్గర్నుంచీ ఆమెమనస్సు—పాగలో యిరుక్కున్నట్లు ఉక్కిరిబిక్కిరైంది. ఆ నగల్ని భర్త దొంగిలించాడా? లేదా? ఒక నిర్ణీతమైన సమాధానం వూహించుకొని, మనస్సును శాంతపర్చుకోలేక పోయింది. భర్తను కనుక్కున్నదాకా—ఆమె గుండెబరువు తగ్గదు; మనస్సులోని చీకాకు సద్దుమణగదు; హృదయంలోని కలవరం పోదు. భర్త ఆ నగల్ని దొంగిలించలేదంటే—ఎంతో సంతోషపడుతుంది!

ప్రొద్దు అటువాలగానే—ఆదెమ్మ మొగుడు, గజదొంగ, జగపతి ఇంటికొచ్చాడు. జగపతిని చూడగానే—పిల్లలు 'వీడు దొంగ' అని సులభంగా చెప్పేస్తారు. అతని ఆకారం అంత గంభీరంగా వుంటుంది. అయిదు అడుగుల పదకొండు అంగుళాల ఎత్తూ, నూటతొంభై రెండు పౌనుల బరువూ, తుమ్మమొద్దు రంగూ గల జగపతి—దొంగతనానికీ, గుండె ధైర్యానికీ, రౌడీతనానికీ, వ్యభిచారానికీ ప్రత్యేకమైన పేరుగలవాడు. అతని జులపాలజుత్తూ, గోడమీద మరకలాగా ముఖంపైని పోడా, కండలు దీరిన వొళ్లూ, మనిషిలోని క్రౌర్యాన్ని చాటే మీసాలూ, లోకాన్ని లెక్కచేయనట్టుగా ఎప్పుడూ ఎర్రగా ప్రత్తికాయల్లాగ వుండే కళ్లూ—అతను వీధిలో నడుస్తూంటేనే మంచిమనసు గలవాళ్లూ, డబ్బు పుష్కలంగా గలవాళ్ళూ, భూతాల్ని చూసి భయపడే పిల్లలూ, వయస్సులోవున్న అందమైన పడతులూ— పామును చూసి బెదిరినట్టు బెదిరిపోతారు దుష్టులకు దూరంగా వుండాలనుకుంటూ.

"ఏమే! కుండలో కూడువుందా," అన్నాడు జగపతి పెళ్ళాంకేసి చూస్తూ.

"కుండలో కూడులేక యేమౌతుంది? కూటికి వేళాపాళా లేదా ఏమిటి?" ఆదెమ్మ ఈసడించుకొంది.



# ★ ఏడుకొండలవాడా! ★

జగపతి పెరట్లోకెళ్లి కుండలోని నీళ్లతో కాళ్లూ, ముఖమూ కడుక్కొచ్చి — పీటమీద కూర్చున్నాడు పై పంచ దులుపుకుంటూ. పళ్లెంలో అన్నమూ, బెండకాయ వేపుడూ, ఎర్రకొరవు పచ్చడీ వడ్డించింది. నేతిగిన్నె ప్రక్కన పెట్టింది. ఎర్రకొరవు పచ్చడి తెల్లటి అన్నంలో ఎర్రగా కలుపుకొని, నేతిగిన్నె అంగులో గుమ్మరించే సరికి—

"ఏం వయ్యోయ్! ఊళ్లో అంతా ఆ గుబ్బగా చెప్పుకుంటున్నారు. చెవిన బడిందా?" అన్నది ఆదెమ్మ మండిగం ప్రక్కని నాపరాయిమీద కూర్చుంటూ.

"ఏమిటది?" అన్నాడు ముఖం పైకెత్తి జగపతి.

"కేశవాయపాలెం కరణంగారి భార్య మెడలోని నగలు పోయిన శుక్రవారంనాడు దొంగలెత్తుకెళ్లారంట. ఆవిడ ఆ నగల్ని తిరుపతి వెంకటేశ్వరస్వామివారికి నిలువుదోపిడిగా సమర్పించుకుంటానికి పెద్ద జబ్బవొస్తే మొక్కుకున్నదట."

"అయితే—" అన్నాడు జగపతి నిర్లక్ష్యంగా.

భర్త ముఖంలోని హెచ్చు తగ్గుల్ని పసికట్టటానికి ప్రయత్నించింది ఆదెమ్మ.

"ఏమీలేదు. అట్లాంటి నగల్ని దొంగిలించటం ఎంతో పాపం. ఆ దొంగిలించిన వాళ్లు ఆ స్వామి ఆగ్రహానికి గురికాకతప్పదు. నువ్వేమైనా దొంగిలించావేమో నని నా ప్రాణం పూగుతూంది." ఆదెమ్మ గొంతు జీరబోయింది.

"నాకీ, తెలీ వాగమాక. ఆ వూళ్లోకి నెలనుంచీ దొంగతనానికి పోనిదే!" అన్నాడు జగపతి.

"నిజమా! ఒట్టువేసి చెప్పండి. ఏడుకొండలవాడు మనఇంటి దేవుడు. ఆ స్వామికి అపచారం తలపెడితే—ఫలితం అనుభవించక తప్పదు."

నోటిలోని అన్నపుముద్ద జారి, పళ్లెంలో పడేట్టు నవ్వాడు జగపతిభార్య మూఢ నమ్మకాలకు.

"ఒసేవ్! నువ్వు నాకు పెళ్ళాంగా వుండాల్సిన దానివికాదే! నాకు దేవుడంటే భయమూ లేదు, భక్తిలేదు. ఆ రెండూవుంటే యీ విద్యలో యింత పైకవొచ్చేవాణ్ణా? నీకేమో మరి, దేవుడంటే—ఎక్కడలేని భక్తి, భయమూ, రోజూ దణ్ణాలు పెడతావ్; ఏవేవో వాగుతూ వుంటావ్; ప్రతి శనివారం ఉపవాసం వుంటావ. ఎందుకొచ్చిన శ్రమే యిదంతా! దేవుడులేడు. ఉన్నా మనకి అగపడేవాడుకాదు. ఎందుకు—ఈ దణ్ణాలూ, ప్రార్థనలూ, ఉపవాసాలూ, నమ్మకాలూ!"

భర్త అంత తూస్కారంగా మాట్లాడడం ఆదెమ్మకెంతో కష్టంవేసింది. రెండు కళ్ళూ మూసుకొని—రెండు చెంపలూ నిశ్శబ్దంగా వాయించుకుంది.

అన్నంతినడం ముగించి—జగపతి పళ్ళెంలోనే చేయికడిగి, పీటమీదనుంచి లేచి, ప్రక్కడేబులోంచి పొగాకుకాడతీసి, చుట్ట చుట్టుకుంటూ బజారుకెళ్ళాడు.

ఆ దొంగతనంలో భర్త వేలు పెట్టలేదని తెలుసుకున్నదై — అమితంగా సంతోషపడింది ఆదెమ్మ.

చుట్ట కాలుస్తూ ఆలోచనలోపడ్డాడు గజదొంగ జగపతి—

కేశవాయపాలెం కరణంగారింట్లో భార్య నగల్ని దొంగిలించింది తనే. తనొక్కడే ఆ దొంగతనం చేసింది. ఆ రాత్రి ఆ ఇంట్లో ఏమీ దొరక్కపోతే—ఆవిడ మెడలోని గోవర్ధన గొలుసునీ, చేతుల వొంకెల గాజుల్నీ దొంగిలించింది తనే. వాటిని ఆ రాత్రికి రాత్రే యానాది రామికి బహుమానంగా యిచ్చేశాడుగా తను! దాని అందానికి అది యిచ్చే ఆనందానికి ఇట్లా ఎన్నినగలు మేవానుగా యిస్తే సరిపోతుందీ? దానికి నిజంగా తనంటే గూటిలోని దీపమే! ఈ వూళ్ళో ఏ మగవాడూ దాని వొంటిమీద చేయి వేస ఎరుగడు. లక్షాధికారి లక్ష్మయ్య కొడుకూ, మునసబు మనుమడూ, చౌదరి బిడ్డ చెంచు రామయ్యా—వీళ్ళంతా దానికోసం తాటాకులదడి దూకినవాళ్ళేగా! చీరకొంగైనా వాళ్లకిచ్చిందీ! తనంటే అదిరిపడి చస్తుంది. తను ఒనాడు కనబడకపోతే—దాని ప్రాణం నీళ్లలోపడ్డ చీమలాగ గిలగిల కొట్టుకుంటుంది.

అయితే ఆనగల్ని దొంగిలించడం పాపమా దాని మాటల ం! దానికి రాళ్ళమీద, రప్పల మీద భక్తిఎక్కువ. ఆ మూఢనమ్మకాలతో ప్రతిపనీ దానికి 'పాపంగానే అగపడుతుంది. నిలువుదోపిడిగా సమర్పిస్తానని మొక్కకున్న ఆనగల్ని తనే దొంగిలించినట్లు తిరుపతి దేవుడికెట్లా తెలుస్తుంది? తను దొంగతనం చేస్తూంటే-తిరుపతినుంచి ఆ అర్థరాత్రి వొచ్చి-చూశాడా?...ఏమిటో!

---

**వీణాం ప్రవీణ**

ఒహాయన ఇంట్లో అవసరం వచ్చి చెయ్యి కాల్చుకోబోయి నిజంగానే రెండు చేతులూ కాల్చుకున్నాడు. డాక్టరొచ్చి చేతులకి మందు రాసి కట్లు కట్టాడు.

"డాక్టరుగారూ! ఈ కట్లిప్పగానే నేను మామూలుగా వీణ వాయించగలనా?"

"ఓ—భేషుగ్గా వాయించుకోవచ్చు."

"తమాషాగానేవుంది స్మండీ. అసలు నాకు వీణవాయించడం రానేరాదు."

---




వీళ్ళ గుడ్డినమ్మకాలూ-వీళ్లు! లోకంలో ఎన్ని దొంగతనాలు జరగటంలేదు? ఆ దొంగతనాల నన్నింటినీ దేవుడు కనిపెట్టి శిక్షలు విధిస్తున్నాడా! తనకి దేవుడంటే భక్తీ, భయమూ ఏనాడూ లేవు. రాయిలాంటిగుండె గలవాడికి అవి అక్కర్లేదు. దేవుడంటే భక్తీ భయమూ-పిరికిగుండెకలవాళ్ళకూ, స్వశక్తిచే పనుల్ని నెరవేర్చుకోలేనివాళ్ళకూ, కష్టాల్లో మునిగి తేలుతూ మానవసహాయం అందని వాళ్ళకూ గానీ-తనలాంటివాళ్లకా! ప్చ్! తను ఆ దొంగతనాన్ని గురించి పాపభీతితో గాబరాపడక్కర్లేదు. నిలువుదోపిడిగా ఇస్తానని మ్రొక్కుకున్న నగల్ని-తను దొంగిలించితే, తనని తిరుపతి వెంకటేశ్వరస్వామి ఏదో చేస్తాడని భయపడటం తెలివితక్కువే. అసలు దేవుడనేవాడు లేడని లోకమంతా కోడైకూస్తుంటే-తను పిచ్చినమ్మకాలకు బెదరటమేమిటి! దేవుణ్ని కళ్లారా చూసినమానవమాత్రుడెవరైనా వున్నాడా! లేడు. అయితే ఈ మొక్కుబడులూ, నిలువుదోపిళ్ళూ, పూజలూ, నమ్మకాలూ ఎందుకు? అంతా వెర్రిమాలోకం.

"ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవిందా!" సన్నాయిమేళంతో కొన్ని కంఠాలు "గోవిందలు" కొట్టినై.

జగపతి తేలు కుట్టినట్టుగా చూశాడు.


చాకలి వెంకాయీ, వెంకాయి కొడుకూ జోగి అడుక్కుంటూ వొస్తున్నారు. 'గోవిందలు' కొట్టేవాళ్లు పదిమందికిపైగా ఉన్నారు. బజారున వెళుతూన్న మునసబు చెప్పులజత విడిచి, జేబులోంచి అర్ధరూపాయితీసి, జోగి పళ్లెంలో వేసి- దణ్ణం పెట్టుకొని చెప్పుల జత తొడుక్కున్నాడు. 'గోవిందా! గోవిందా!' అంటూ కంఠాలు మ్రోగినయ్. జగపతి అంతా చూస్తూనే ఉన్నాడు వీధి ప్రక్క నిలబడి. అతను చూస్తుండగానే నలుగురైదుగురు ఆ పళ్లెంలో, డబ్బు వేసి రెండుచెంపలూ వాయించుకున్నారు.

"ఏం జగపతీ! ఏడుకొండలవాడికి ఒక రూక వేయరాదూ!" అన్నాడు సుబ్బన్న రైతు.


వికిలిగా నవ్వాడు జగపతి. ఆ నవ్వులో ద్వేషమూ, అసహ్యమూ, ఎగతాళీ ధ్వనించినయ్.

జోగి అడుక్కునేవాళ్లు జగపతి ముందుగానే నడిచివెళ్లారు. జగపతి చిల్లికానీ వేయలేదు.

ఏడుకొండలవాడికి తను రూపాయివేయాలట! తనంత తెలివితక్కువవాడా! మూర్ఖుడా! రూపాయిపెడితే అర్ధశేరు ఉత్తరాది పొగాకురాదూ! తనెందుకు రూపాయి వృధాగా దేవుడికియ్యాలి! అనుకుంటూ జగపతి గుళ్ళోకెళ్ళాడు పేకాట ముఠాదగ్గరకు.



విశాఖపట్నం సంస్కృతి సంఘ ఉత్సవాలలో నృత్యప్రదర్శన చేసిన శ్రీమతి ఇ. వి. సరోజ, సంఘప్రధానకార్యదర్శి శ్రీ ఎమ్. జి. కె. మూర్తి.



ఉత్సవాల్లోపాల్గొన్న ప్లేబాక్ గాయకుడు
తలత్ మహమూద్



ప్రారంభోపన్యాసంచేసిన ప్రముఖనటుడు
శ్రీ జగ్గయ్య

ఆ సాయంత్రం మబ్బులుకూడబలుక్కున్నట్టు గుమిగూడి- చల్లగాలిని ఆహ్వానించి కడవపోతగా వర్షించాయి. ఆ వర్షంలో ఆదెమ్మ మూడేళ్ళ ముద్దులకొడుకు ముచ్చటగా గంతువేశాడు. ఆమె ఎండపోసిన వడ్లను గబగబా ఎత్తుతూంటే, 'జబ్బుచేస్తుందిరా!' అని ఆదెమ్మ ఎంత మొత్తుకున్నా, కుర్రకుంక కుతూహలంకొద్దీ వానలో మునిగి తేలాడు.

ఆరాత్రి జగపతి ఇంటికొచ్చేప్పటికి ఆదెమ్మ- పిల్లవాడి మంచంప్రక్కన ముసుగు దీసికొని కూర్చుంది. పిల్లవాడికి జ్వరం, వొళ్లునొప్పులు. కాళ్లు తిసుకుపోవటం- సుడిగాలి చుట్టవేసికొన్నట్టుగా చుట్టవేసుకున్నాయి. పసివాడు మంచంలో మెలికెలు తిరిగిపోయాడు పురివిప్పిన త్రాడులాగ. ఆ పిల్లవాడి తీరుచూసి ఆదెమ్మ గుండె బాదుకుంది. ఆచార్లు దగ్గరకెళ్ళి మందుతెచ్చింది. మొగుడికోసం కనిపెట్టుకుకూర్చుంది.

కొడిగుడ్డు లాంతరు గుడ్డివెలుగులో పిల్లవాడిరూపు సరిగ్గా గోచరించలేదు జగపతికి.

(55-వ పేజీ చూడండి)

# ★ ఏడుకొండలవాడా! ★

(27వ పేజీ తరువాయి)

"ఎందుకే అట్లా కూచున్నావ్?" అన్నాడు దూకుడుగా.

ఆదెమ్మగొంతు చిన్నగా వొణికింది.

"అబ్బాయి..."

"ఏం అబ్బాయికి?...

"జ్వరం, వొళ్లంతా గొడ్డలితో పేళ్ళు పగలగొట్టినట్టుగా వుందంట....".

జగపతి గుండె గాలికి ఎండినఆకు కొట్టుకున్నట్టుగా కొట్టుకుంది. ఒక్కగానొక్క కొడుకుమీద అతని కెంతో ప్రేమ, అభిమానం. వంశోద్ధారకుడు. ఇంటిదీపము, అన్నీ ఆ ఒక్క కొడుకే. వాడుతుమ్మినా, దగ్గినా కళ్ళల్లో నలకపడి కన్నీరు కార్చినా-ఆ దంపతులు తల్లడిల్లి పోతారు.

జగపతి మంచంపట్టెమీద కూర్చుని కొడుకు ముఖంలోకి చూశాడు. ఆదెమ్మ కోడిగుడ్డులాంతరువత్తి పెద్దది చేసింది.

మంచంలో పిల్లవాడు దయ్యంపట్టినట్టు ఎగిరెగిరిపడుతున్నాడు. జగపతికి గాబరా వేసింది. ఆదెమ్మకు అంతులేని భయం కలిగింది. పిల్లవాడి కెప్పుడూ అంత పెట్టున రోగం రాలేదు.

"ఆచార్లు చూశాడా!"

"ఆ! జ్వరం నూటమూడుకున్నదట."

"నూటమూడే!" జగపతి గుండెలో అధైర్యం ఎందుకో తలఎత్తింది.

"అమ్మో.. అమ్మో...నొప్పి! నొప్పి! పిల్లవాడి ఏడుపు.

పిల్లవాడి శరీరమంతా నిమిరాడు జగపతి చెమ్మనిండిన కళ్ళతో. ఆదెమ్మ కన్నీళ్ళు పింపలుదిగాయి.

ఆ రాత్రి దంపతులిద్దరూ భోజనాలు చేయలేదు. నిద్రపోలేదు. పిల్లవాడికి జ్వరమూ, నొప్పులూకూడ వెనుకొడలేదు.

మరునాడు ఉదయం ఆచార్లు వొచ్చాడు. జ్వరం చూశాడు — నూట నాలుగున్నర ఉంది. కనుబొమలు ఎగురవేశాడు. పిల్లవాడు పిచ్చిధోరణిలో పడ్డాడు. ఆయుర్వేదంలో అందెవేసిన చెయ్యి ఆచార్లుది; కాని ఆ రోగం అంతుపట్టలేదు.

"ఏం ఆచార్లుగారూ! పిల్లవాడి పరిస్థితి అర్థం కావటంలేదు. ఏమంటారు? తగ్గుతుందంటారా!" అన్నాడు జగపతి గాద్గదిక స్వరంతో.

ఆచార్లు పెదాలు తడిచేసుకున్నాడు.

"ఉన్నమాట చెబుతున్నా. ఇంత దూకుడుగా వొచ్చిన రోగాన్ని నేను యింతవరకు చూడలేదు. మంచి మందులే ఇచ్చాను. ఆపైన ఏడుకొండలవాడిదయ".

ఆ మాటలు ఆదెమ్మ విన్నది.

ఆమె కళ్ళముందు ఏడుకొండలవాడి రూపు మెదిలింది. పడమటింట్లోకి పరుగెత్తింది. తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రపటం ముందు సాష్టాంగపడింది.

"స్వామీ! మామీద దయలేదా! పిల్లవాడి కేమిటీ విపరీతం? ఒక్కగానొక్క కొడుకు కంటికి రెప్పలాంటివాడు. ఇంటికి దీపం. వంశానికి వెలుగు. మా ప్రాణాలన్నీ వాడే. వాడు లేకపోతే మా బ్రతుకు తేబూడిద. దయచూపు స్వామీ! నా ముద్దుల కొడుకు యీ గండం గడిచి బయటపడితే, ఈ రోగం నయమై బట్టకడితే—ఏడూళ్ళు జోగి తిరిగి వాడి తలనెంట్రుకలు తమకు సమర్పించి, కానుకలు ముట్టజెపుతాను. ఏడుకొండలవాడా! వేంకటారమణా! ఈ దీనురాలి కోర్కె ఆలకించి, పిల్లవాడి జబ్బు యిట్టే మాయంచేయి ప్రభూ! నీ మొక్కు తీరుస్తాను."

ఆదెమ్మ గుండె ఆవేదననుంచి వెలువడ్డ ఆ మాటలూ, ప్రార్థనా, మొక్కుబడీ జగపతి విన్నాడు. 'మంత్రాలకూ, మొక్కుబడులకూ—రోగాలు నయమౌతాయా' అనుకున్నాడు. మూఢనమ్మకాలను బయట వేసుకోవటమే కానీ—ఆంజనేయస్వామి ఆంచన కడితేనూ, ఏడుకొండలవాడికి మొక్కుకుంటేనూ, దేవీపూజా ఫలితంవల్లనూ ఎక్కడేనా జ్వరాలు నయమౌతాయా అనే ఉద్దేశ్యం గలవారి వర్గానికి చెందినవాడైనా, అట్లాంటి ఆచారాలకు సంపూర్ణంగా అసమ్మతిని తెలియజేసేవాడైనా జగపతి—కొడుకు పరిస్థితీ, వాడి బ్రతుకుమీదగల అధైర్యమూ, అపనమ్మకమూ గమనించాక భార్య మొక్కుబడిని విని పైకి ఏమీ అనలేకపోయాడు. నమ్మకాలనూ, పూర్వాచారాలనూ విపరీతంగా ద్వేషించేవాళ్ళే — ఒక్కొక్కప్పుడు, గుండెలో అధైర్యం జొరబడినప్పుడూ, చిక్కుబడిన దారపుబంతిలాంటి కష్టాలకు మనస్సు పరిష్కారమార్గాన్ని వెతుకలేనప్పుడూ, జీవితం ముందుకుసాగదనే అపనమ్మకం ఏర్పడ్డప్పుడూ—కొంతమంది మూఢనమ్మకాలమీద విశ్వాసాన్ని కుదుర్చుకుంటారు, పూర్వాచారాల్ని ఆచరిస్తారు. జగపతి ఎంతగుర్మార్గుడూ దొంగా, వ్యభిచారీ, దేవుడంటే భయమూ, భక్తి లేనివాడైనా, అతనిగుండె ఎంత రాయిలాంటిదైనా, అతని నిశ్చయం ఎంత గాఢమైనదైనా—అతనికి ఒక్కగానొక్క కొడుకుమీదగల ప్రేమా, అభిమానమూ, మమతా అతన్ని కట్టిపడవేశాయి. అజ్ఞాతంగా అతనిలో దేవునిమీద ఒరకమైన భక్తిని ప్రేరేపించాయి. అప్రయత్నంగా అతని రెండుచేతులూ వెంకటేశ్వరుని చిత్రపటానికి నమస్కరించాయి.

ఆనాటి సాయంత్రానికి కుర్రవాని జ్వరం కొంచెం తగ్గుముఖం పట్టింది. మంచంమీద ఎగిరెగిరి పడటాలు తగ్గాయి.

ఆదెమ్మ ఏడుకొండలవాడికి నమస్కరించి—మొక్కిన మొక్కును జ్ఞాపకం చేసుకుంది. ఆరాత్రి గడవగానే—కుర్రవాడిలో జ్వరం చప్పగా జారిపోయింది. 'ఇదంతా ఆ ఏడుకొండలవాడి మహిమే!' అనుకున్నాడు జగపతి. 'సందేహమా! తిరుపతి దేవునకు నామీద, నా ముద్దుల కొడుకుమీద కరుణకలిగింది ఆ దివ్యమూర్తి కటాక్షంవల్ల నే కుర్రవానికి గండంగడిచింది' అనుకుంది ఆదెమ్మ.

'ఆయుర్వేదంలో ఆరితేరినవాడ్ని అంతా నామంగు ప్రభావమే. నిన్న ఉదయం వాడిన వజ్రపు తునకల్లాంటి మాత్రలతో పిల్లవాడు మృత్యుముఖంనుండి బయట పడ్డాడు' అన్నాడు ఆయుర్వేద వైద్యశిఖామణి ఆచార్లుగారు.

'ఏమైతేం పిల్లవాడు బ్రతికి బయట పడ్డాడు. అదేచాలు!' అనుకున్నాడు జగపతి.

తర్వాత మూడురోజులకే ఆదెమ్మకొడుకు చిందువేస్తూ తిరిగాడు. (మిగతా వచ్చేవారం)


## మీ అబ్బాయి చదువు

మీ అబ్బాయి చదువును ఎ. ఎస్. మూర్తి, ఎం. ఏ. వ్రాసిన విద్యాదర్శిని అనే పుస్తకం చదివి నిర్ణయించండి. అందులో 32 రకాల యింజనీరింగు చదువులు, 84 రకాల వృత్తి చదువులు, 20 రకాల డాక్టరు చదువులు, వీటికి హైస్కూలు చదువునుంచి తీసుకోవలసిన జాగ్రత్తలు, హైస్కూలు చదువు అవగానే కాలేజీ చదువు అవసరం లేకుండా డబ్బు సంపాదనకు పనికివచ్చే ఎన్నో యితర చదువులు మన దేశంలోని రకరకాల కాలేజీలు, వాటి ఎడ్రస్సులు, వాటిలో చెప్పే చదువులు, వాటికి అయ్యే ఖర్చులు, విదేశ చదువుల వివరాలు, స్కూలు ఫైనలు తప్పినవారికి మంచి భవిష్యత్తునిచ్చే చదువులు, ఇలా పిల్లల చదువులకు సంబంధించిన అన్ని వివరాలు విద్యాదర్శినిలో ఉన్నాయి చదువుకొనే పిల్లలున్న ప్రతివారికి యీ పుస్తకం చాలా అవసరం. 320 పేజీలు. వెల వి. పి. పోస్టు ఖర్చుతో రు. 5. ఇదిక్రింది చోటనే దొరుకును. మూర్తి & వినాయకం, 83, పీటర్సురోడ్డు, మద్రాసు-14 అనే అడ్రస్సుకు మీకుకూడా ఒక పుస్తకం వి.పి.పోస్టుద్వారా వెంటనే పంపించమని ఒకఉత్తరం వ్రాయండి.

SWASTIK

# ఏడుకొండలవాడా! వెంకటరమణా!—

[గత వారం తరువాయి]


**2**

ఏడుకొండలవాడి చల్లని చూపువల్లనే తమ కొడుకు గండం గడచి బయట పడ్డాడనే అభిప్రాయానికి ఆదెమ్మ గాఢంగానూ, జగపతి కొద్దిగానూ గురియైనారు. ఎన్నో యేళ్లుగా ఆమెకు ఏడుకొండలవాడు - ఇష్టదైవముగనుక దేవుని మహత్తు గుర్తించటంలో ఆమె ముందజ వేసింది.

తన కొడుక్కి జబ్బు తిరుపతి వెంకటేశ్వర స్వామికి మ్రొక్కుకోగానే తగ్గడంలో- ఏమైనా ఆ స్వామి ప్రభావం వుందా! ఆ చాగ్లు యిచ్చిన మాత్రలకే తగ్గిందా? అంతు పట్టకుండా వుంది జగపతికి. ఆ స్వామి అనుగ్రహంవల్ల ఆపదలనుంచి బయటపడ్డ వాళ్ళు లోకంలో లెక్కపెట్టలేనంత మంది వున్నారని చెప్పుకుంటూ వుంటారు. అదంతా నిజమేనా! పడమటివీధి శాంతమ్మ కొడుక్కి పక్షవాతంలో చచ్చుబడ్డ కాళ్లు- ఏడుకొండలవాడికి మ్రొక్కుకుంటే, సరిగ్గా వొచ్చాయట. వాడిప్పుడు నూట అరవై నాలుగు పౌన్ల వస్తబస్తా అలకంగా మోస్తాడు. నాయుడిగారి కూతురు, ఆరేళ్ళ పిల్ల డాబామీదనించి క్రిందబడి, తలనలు ముఖాలుగా పగిలి నెత్తురు వరదలైపారగా- ఆ తల్లి గుండె పగులగొట్టుకొంటూ వెంకటేశ్వరునికి మొక్కుకుంటే, చావు బ్రతుకుల్లో వున్న ఆపిల్ల-బ్రతికి యిప్పుడు రోజూ గంతులేస్తూ బళ్ళోకి పోతుందట. ఒంటెద్దు బండి వీరాస్వామికి చూపు రావడం కూడా వెంకటేశ్వర స్వామి చల్లని చూపువల్లనేనట. ఆ పరమాత్ముని మహత్తు గూర్చి ఇట్లా ఎన్నో దృష్టాంతరాలను తను నిత్యమూ వింటూనే వున్నాడు. కాని తను యిన్నాళ్ళుగా ఆలోచించనేలేదు. అంతా పిచ్చిమూక! ఇంతమంది డాక్టర్లుంటే ఆ స్వామికి మ్రుక్కుకున్న మాత్రానే రోగాలు నయమౌతాయా—అనుకున్నాడు. కాని, ఏమిటో తనకే—అందరిలాగే నమ్మకం కలుగుతూంది. ఎవరికైనా ఆపదవొస్తే కానీ—దేవుని అవసరం రాదనీ వూరికే అన్నారా!

కాని తను కేశవాయపాలెం కరణంగారి భార్యనగలు శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి చెందవలసినవి - దొంగిలించాడే! అనగల్ని దొంగిలించడం ఎంతో పాపం. 'ఆ దొంగిలించిన వాళ్ళు ఆ స్వామి ఆగ్రహానికి గురికాక తప్పదు' అన్నది భార్య. కాని తనకెట్లా తెలుసు! తెలియక చేసిన తప్పును మన్నించే విశాల హృదయం లేదూ, స్వామికి! తను అజ్ఞాని. అహంకారి! ఇప్పటివరకూ దేవుడంటే లక్ష్యం లేదు. తన దొంగతనవృత్తిలో అడ్డు తగిలిన ప్రతివాడికీ హాని పుట్టించడమే తనపని. కాని తను దొంగతనం మాని వేయటమే మంచిది. చేసిన తప్పులకు క్షమాపణ కోరుకొని—ఇకముందు అట్లాంటి తప్పులు చేయనని వాగ్దానం చేయడం మేలు. తనజీవితానికి పరమార్థమేమిటి? దొంగతనం, మోసం, దౌర్జన్యం, జైలు—ఇవేనా? తన బ్రతుకిట్లా వెళ్ళమారవలసిందేనా? లోకంచాత తను చచ్చేవరకూ 'దొంగ'గా పరిగణింపబడాల్సిందేనా? తనూ నీతిగా, నిజాయితీగా, న్యాయంగా ఎందుకు బ్రతకరాదు? తను ఎగురుపడితే గౌరవనీయులు అట్లా తప్పుకు పోతారేం? తనువీధిలో నడుస్తూంటే—ఆడవాళ్లు తలుపులు వేసుకుంటారేం? తనని చూసి పిల్లలు పరుగెడతారేం? తను బ్రతుకును ఇంకో గాడిలో పడేయ్యాలి. మనుష్యులందరితో కలిసి మెలిసి తిరిగేట్టుగా బ్రతకాలి—జగపతి ఆ విధంగా ఆలోచించుకున్నాడు ఓరోజు సాయంకాలం.

జగపతి వారంరోజులవరకూ రాత్రుళ్లు ఇంటిదగ్గరే పడుకున్నాడు. అమావాస్య సమీపిస్తున్నా, దాటిపోతున్నా— రాత్రిళ్లు ఇల్లుకదల్లేదు. ఆదెమ్మ ఆశ్చర్యపోయింది మొగుడిలో కలిగిన మంచిబుద్ధికి.



తాళ్ళూరి నాగేశ్వరరావు

# ★ ఏడుకొండలవాడా! ★

కాని అలవాటైన ప్రాణం, తిరిగే కాళ్లూ, తిరిగే చేయీ—జగపతిలో పుండును రేపి పట్టుగా రేపాయి. ఎనిమిదోనాటి రాత్రి ఇంటికి రాలేదు. తెల్లవారుఝామున వొచ్చాడు కుంటుకుంటూ. గోడదూకుతూంటే అరికాలిలో సీసాపెంకు గుచ్చుకున్నదట.

తెల్లవారింది. ప్రొద్దు పొడిచింది. సూర్యుడు కొండ ఎక్కాడు. జగపతి మంచం మీదనుంచి లేవలేదు. బురదలో దిగబడ్డ ముసలిఎద్దు మూలిగినట్టు మూలగ నారంభించాడు. సీసాపెంకును ఆహ్వానించి, మర్యాద చేసిన అరికాలు—దుష్టుడికి ఇంట్లో చోటుపెట్టి తర్వాత తల బొప్పి కట్టగా ఏడుస్తూన్న యజమాని లాగ, ఏడ్వనారంభించింది.

"ఎందుకొచ్చిన కర్మ! నేను ఎంత చెప్పినా చెవి కెక్కదాయె! ఇంట్లో దేవుడికి ఒక ప్రక్క దణ్ణం పెడుతూ—పొరుగూరిలో రాత్రిపూట గోడలు దూకితే కాళ్ళు విరక్కా సీసాముక్కలు దిగకా వుంటాయా! మనిషికి సిగ్గూ, సెత్తురూ వుండాలె!" అనుకొంటూ ఆదెమ్మ ఆచార్లు దగ్గర కెళ్ళింది.

ఆచార్లు వొచ్చాడు. మూడు చిటికెలు ముక్కుపొడుం ఘాటుగా పీల్చి అరికాలిని అటూ ఇటూ తిప్పి, కళ్ళజోడును కదిలిస్తూ.

"ఒస్! ఈ మాత్రానికే మంచంలో కుందేలు పిల్ల ఎగిరిపడ్డట్టు ఎగిరిపడతావేం జగపతీ! మూడు రోజుల్లో దీన్ని మచ్చ లేకుండా మాపుచేయనూ! శస్త్ర చికిత్సలో ఈ ఆచార్లను మించిన వైద్యుడు అరవై ఆమడల్లో అటూ ఇటూ లేరు. ఏమనుకుంటున్నావో!" అన్నాడు.

ఆ ఉదయమే ఆచార్లు జగపతి అరికాలిలోని సీసా పెంకును తొలగించాడు. జగపతి ఆ బాధకు క్రిందూ మీదూ అయినాడు; ఎద్దుగిట్టలకు నాడాలు కొడుతూంటే గిలగిలా తన్నుకున్నట్టు తన్నుకున్నాడు. సీసా పెంకు తీసివేయగానే అరికాలి నొప్పి తగ్గుతుందనుకున్నాడు జగపతి. ఆచార్యుల వారు అల్లానే సెలవిచ్చారు. కాని అతని నొప్పి తగ్గలేదు. ఒక రాత్రి గడిస్తే చప్పగా నొప్పి తీస్తుందని ధైర్యం చెప్పాడు ఆచార్లు.

ఆరోజు గడిచింది. మరునాడూ వెళ్ళింది. మూడో రోజు కూడా ఆ నొప్పి తగ్గక, ఆ గాయం చుట్టూ పుట్టకుక్కల్లాగ బొబ్బలు లేచినయ్. లోపల ఏదో పురుగు వున్నట్టుగా దురదగా వుంది. కాలు క్రింద పెట్టేందుకు లేదు. జగపతికి పిచ్చిఎత్తినట్టుగా వుంది. ఏం తోచడం లేదు. ఒక ప్రక్కన నొప్పి, మరో ప్రక్క మంచంలో ఎన్నాళ్లు పడి వుండాలో నన్న దిగులూ—అతన్ని క్షణ క్షణమూ క్రుంగదీస్తున్నయ్.

భర్త పడే బాధను చూసి కంటిమీద కునుకు లేదు ఆదెమ్మకు.

ఆచార్లు మందు యిస్తూనే వున్నాడు. నయమౌతుందని ధైర్యం చెబుతూనే ఉన్నాడు.

వారం గడిచింది.

జగపతి అరికాలిగాయం దిన దినాభివృద్ధి గాంచింది. మడం వరకూ కాలు వాచింది. అతనిలో అధైర్యం గూడుకట్టింది. అపుండు చూసి ఆదెమ్మ భయపడింది. భర్త పడే విపరీతమైన బాధకు—ఆమె భోజనం కూడా మానివేసింది.

మళ్లీ ఆదెమ్మ ఏడుకొండలవాడి చిత్రపటంముందు మోకరిల్లింది—

'స్వామీ! మళ్లీ యీ ఉపద్రవ మేమిటి? నేనేం పాపం చేశాను? నా సంసారంలో యీ కష్టాలేమిటి? నీ చల్లని చూపు వల్లనే చావు బ్రతుకుల్లో వున్న కొడుకు బ్రతికి బయటపడ్డాడు. నీ చల్లని చూపు వల్లనే మరణవేదన పడుతూన్న నా భర్త కూడా బ్రతకాలి. స్వామీ! వొచ్చే మాఘ మాసంలో పదకొండు పూళ్లు జోగి అడుక్కుని తిరుపతిలో తమని దర్శించి, నా భర్త తల వెంట్రుకలు తమకు సమర్పిస్తాడు. కరుణించు ప్రభూ! నా భర్త బాధపడుతూన్న వ్రణాన్ని మాన్పి, బాధను తొలగించు స్వామీ! వచ్చే ఏడు తప్పకుండా మొక్కుబడుల్ని చెల్లిస్తాము. దయదల్చు తండ్రీ!" వేడుకొన్నది ఆదెమ్మ.

తన మొక్కుబడిని భర్తకు తెలియజేసింది ఆదెమ్మ.

జగపతికి శాంతి చిక్కలేదు. బాధ తగ్గ లేదు.

తన ఒక్కగా నొక్క కొడుకును ఆనంద స్వరూపుడైన వెంకటేశ్వర స్వామి కటాక్ష వీక్షణముచే ప్రాణాపాయంనుంచి రక్షించుకున్నట్లే, ఆ స్వామి అనుగ్రహంచే భర్తను కూడా అదేవిధంగా - యమబాధనుంచి తప్పించుదా మనుకున్నది గానీ, ఆదెమ్మ ఆలోచన అక్కరకు రాలేదు.

జగపతి పుండు నయంకాలేదు. బాధ రవ్వంత తగ్గలేదు. ఆచార్ల మందుమీదకూడ ఆశ తొలగింది.

"మీరట్లా అధైర్యపడితే లాభంలేదు. పెద్ద శస్త్రచికిత్స చేస్తాను. ఇంకా దాని అవసరం కలక్కనే వూరుకున్నాను. ఇదుగో యింకా మూడునాలుగు రోజులు చూసి అంతపనీ చేస్తాను. అప్పుడుగానీ మీకు నా వైద్యపువిలువ తెలిసిరాదు." అన్నాడు ఆచార్లు.

ఆ మాటల్ని లక్ష్యపెట్టలేదు జగపతి. వరదలో ఏటిమధ్య కొట్టుకుపోతున్న వాడికి


ఒకటి కాదు 17 రకాల సువాసనలు
మిమ్ము ఉత్తేజపరచి
ఆనందపరచగలవు!
17 ఉత్తేజ పరచే సువాసనలు కలిపి అద్భుతముగా తయారు చేయబడిన పామొలీవ్ నిజంగా మంచి టాల్కు...ఇది కుటుంబములో వారికందరికి..... మరియు పిల్లలకు కూడ చాలా మంచిది!




PTO/Q/3

కొడుకువున్నవాడు 'జాగ్రత్తలు' చెప్పినట్టుగానే తోచాయి.

అరికాలిమీద గాయం-వ్రణంలాకి మారి, మనిషిని నిలువంటా రంపపుకోతలాంటి బాధకు గురిచేసేప్పటికి, జగపతిలోని అహంకారమూ, మదమూ, కళ్ళల్లోని కొరకొరా, నోటిదూకుడూ, నిర్లక్ష్యమూ, విర్రవీగుడూ నీటిలోపడ్డ యిసుకగడ్డ కరిగిపోయినట్టుగా కరిగిపోయినాయి. పశ్చాత్తాపం తలఎత్తుతూంది. కండకావరంతో కళ్లుమూసుకొని చేసిన పనుల-ఫలితాలు త్రాచుపాములై, పగబట్టి వెంటాడుతూన్నట్టుగా తోస్తున్నాయి.

ఈ అరికాలిగడ్డతో తన బ్రతుకు ఆఖరు! వొళ్ళు తెలీని అజ్ఞానంతో చేసిన పాపాలు గూడుకట్టి యీనాడు కాలిమీది వ్రణం రూపంలో తనని అవసానదశకీడ్చుకొచ్చి, నరకానికి నాందిగా బాధలో కుళ్ళగిస్తున్నయ్! ఏడుకొండలవాడికి తనపై ఆగ్రహం కలిగింది. దానికి కారణం తనే. తను చేసుకున్న కర్మ-తనముందు అగ్నిగుండాన్ని సృష్టించింది. కేశవాయపాలెం కరణంగారి భార్యనగల్ని తను దొంగిలించడంతో-తన పాపం పక్వానికి వొచ్చింది. ఆ నగలు తిరుపతి వెంకటేశ్వరస్వామివారికి నిలువుదోపిడీక్రింద చెల్లవల్సివుండాలని - తనకు తెలిసినా తను అహంకారంతో, కండకావరంతో, నిర్లక్ష్యంతో, మోటుతనంతో ఆ నగల్ని తిరిగి దొంగిలించినచోటుకు చేర్చే ప్రయత్నం చేయలేదు. దానితో తన పాపం పండింది. ఈ కాలి వ్రణం ఆ పాపఫలితమే!—అనుకున్నాడు జగపతి మంచంలో మూలుగుతూ.

పసిపిల్లవాడు నిద్రబోతూన్నట్టుగా వుంది అర్ధరాత్రి. దురదృష్టవంతుని జీవితంలోని దుఃఖంలాగ వుంది చీకటి. గదిలో కొడిగుడ్డు లాంతరు నిగ్రోవాని ముఖంపై సంధ్యాకాంతి పడ్డట్టుగా వెలుగుతూంది. నూనె అయిపోవొస్తూన్న ఆ దీపపుకాంతి—మూఢుని మనస్సులాగ పరిమితంగా కాంతిని పరుస్తోంది.

ఆదెమ్మ ప్రాణం శోషిల్లగా—భర్త మంచం ప్రక్కనే యీతాకుల చాపమీద శరీరాన్ని చేరగిలవేసింది. ఆమె కళ్ళు మూసుకొని వున్నాయి. ఆదెమ్మకొడుకు నిశ్చింతగా నిద్రబోతున్నాడు. కాని జగపతి మేల్కొనే వున్నాడు. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు అంత బాధలోనూ. గంటసేపు ఆలోచించి—నిశ్చయానికొచ్చాడు అటువంటి స్థితిలోనూ.

మెల్లగా మంచందిగాడు.

కొడిగుడ్డు లాంతరు వొణికింది. గదిలో వెలుతురుకూడ కదలాడింది.

మంచం దిగిన జగపతి, కాలును యీడ్చుకుంటూ, నేలమీద కాళ్లు లేనివాడు దేకినట్టుగా దేకుతూ, పడమటి గదిలోకి వెళ్లాడు. వెంకటేశ్వరస్వామివారి చిత్రపటంముందు రెండుచేతులూ జోడించి బోర్లాపడ్డాడు జగపతి. గుండెలో ఆవేదన పొంగుకొచ్చింది—

"స్వామీ! ఆర్తజనరక్షకా! ఈ దౌర్భాగ్యుడ్ని మన్నించు! ఈ దుర్మార్గుడ్ని క్షమించు! ఈ దుష్టుడ్ని కనికరించు! అజ్ఞానంతో, అహంకారంతో అవివేకంతో—శరీర సుఖంకోసం, స్వలాభంకోసం ఎన్నెన్నో పాపాలు చేశాను. తుదకు తమకు మొక్కుకున్న నగల్నికూడా దొంగిలించాను. క్షమించు ప్రభూ! నా కంఠంలో ప్రాణం వుండగా ఆ నగల్ని ఎప్పటిచోటుకే చేరుస్తాను. తమ మ్రొక్కుబడి సక్రమంగా జరిగేట్టు చూస్తాను. ఈ దాసుడ్ని దయతో చూసి, ఈ కాలిబాధను తప్పించు ప్రభూ! లేకుంటే ఈరాత్రి తమ పాదాలకడనే ప్రాణాన్ని విడుస్తాను. ఈ బాధకోర్వలేను స్వామీ! తమరు కనికరించకుంటే—ఆత్మహత్యే శరణ్యం. నా గుండెను తొలిచి చాచిన అరచేతిలోపెట్టి—తమ సమక్షాన మాట్లాడుతున్నాను. వచ్చే మాఘ మాసంలో పదకొండూళ్లు జోగి తిరిగి, తలవెంట్రుకలు తమకు సమర్పిస్తాను. ఇక జీవితంలో దొంగతనం చేయను. మనిషిపుట్టక పుట్టినందుకు-మనిషిగానే బ్రతికేందుకు ప్రయత్నిస్తాను. నన్ను క్షమించవా, స్వామీ! ఈవరకబాధనుండి నాకు విముక్తిలేదా! ఈబాధతోనే చావాల్సిందేనా! నాఖర్మ యింతేనా! కనికరానికి నేను నోచుకోలేదా! ఏం ప్రభూ! స్వామీ!

మిగతా రాత్రంతా జగపతి స్వామివారి చిత్రపటంముందే స్పృహతప్పి పడిపోయినట్టు పడివున్నాడు.

ఆదెమ్మకు మెలకువ వొచ్చేప్పటికి-గదిలో కొడిగుడ్డు లాంతరు వెలుగులేదు. అన్నం లేనివాడు ఆకలిబాధతో నిద్రపోయినట్టే నూనెలేని ఆలాంతరు నిద్రపోయింది. చీకట్లో మంచం తడిమిచూసింది. భర్తలేడు.

కెవ్వన కేకవేసింది ఆదెమ్మ.

ఆకేకకు మేల్కొలేదు జగపతి.

## 3

జగపతి మనస్సు తృప్తిపడింది. ఇక తను చచ్చినా-సుఖంగా చావచ్చు ననుకున్నాడు. గుండెలో ఆవేదనంతా స్వామివారి ముందు వెళ్లగ్రక్కాడు. హృదయం తేలికపడింది.

ఆచార్లు శస్త్రచికిత్స చేశాడు.

మరునాటికి నొప్పి తగ్గింది.

మూడోనాటికి గాయం మానిపోనారంభించింది.

"శ్రీ వెంకటేశ్వరస్వామి నన్ను కరుణించాడు. నాతప్పుల్ని క్షమించాడు. గండం గడిచింది. నాఅరికాలి వ్రణం నయమైంది. ఏడుకొండలవాడా! వెంకటరమణా!" కేకవేశాడు జగపతి సంతోషం పట్టలేక.

ఆదెమ్మకళ్లుఆనందంతోనీళ్లునింపుకున్నాయి.

"నావైద్యం విలువ తెలిసిందా జగపతీ!" అన్నాడు ఆచార్లు.

తర్వాత వారంరోజులకే గజపతి బాగా తిరగనారంభించాడు. అతనిలో ఎంతో మార్పు వొచ్చింది. వానకురిసి వెలిశాక పచ్చని ఎండకు ప్రకృతి కళకళలాడుతున్నట్టుగా—పశ్చాత్తాపంలో కొట్టుకుపోయినపాపం పోగా, హృదయం కళకళలాడుతున్నది.



"అయ్యా! మేనేజరుగారు పిలుస్తున్నారు. ఒక్కమాటిలా చూస్తారా?"

# ★ ఏడుకొండలవాడా! ★

"గజదొంగ కాలు నయమైంది. మళ్లీ ఊరికి మొప్పమే!" అనుకున్నారు కొంత మంది.

కాని అతనిలో వొచ్చినమార్పుకు ఆ వూళ్లో వాళ్లంతా ఆశ్చర్యపడ్డారు. తన చుట్టూ తిరిగే దుష్ట చతుష్టయాన్ని దూరంగా పెట్టాడు. దొంగతనానికి స్వస్తి చెప్పానని బహిరంగంగా ప్రకటించాడు.

వెంకటేశ్వరస్వామి భక్తుడైనాడు.

ఉదయం కావడంతో, శ్రీవారి దర్శనం చేసికొనిగానీ—ఏ పనీ చేయడు. నిత్యమూ నుదుటమీద పంగనామాలు అందంగా దిద్దుతాడు. పవిత్రంగా బ్రతకాలని అతని జీవితాశయం.

"దొంగతనం, మోసం, టక్కరితనం, దౌర్జన్యం—బ్రతుకుదెరువు కావు. భగవంతుడిచ్చిన శరీరంవుంది. అది వున్నంత కాలం కష్టించి పనిజేసి, సంసారయాత్ర సాగించాలి. నేను కూలిచేస్తాను. వస్త్రబస్తాలు మోస్తాను. పొలంలో పనిచేస్తాను. అందరి కూలీలలాగా నీతిగా, నిజాయితీగా బ్రతుకుతాను. ఆజీవితంలో ఆనందం ఎట్లా చిక్కదో చూస్తాను. అన్నింటికీ ఆ పరమాత్ముడే వున్నాడు," అనుకున్నాడు గజపతి గట్టిగా.

ఆ రోజు ప్రొద్దుగ్రుంకగానే జగపతి రామియింటికి కెళ్లాడు. కాలివ్రణం నయమైనాక అదే వెళ్లడం మొదలు.

"ఏం దొరగారికి, ఇప్పటికి దయకలిగింది" అన్నది రామి ఎత్తిపొడుపుగా.

"ఆ నగ లెక్కడున్నాయి" అన్నాడు కూర్చోకుండానే జగపతి.

"ఏం నగలు" ఏమీ తెలీనట్టుగా ఆశ్చర్యపోయింది రామి.

"ఆరోజు తెల్లవారగట్ల కేశవాయపాలెం నుంచి దొంగిలించి నీకిచ్చినే, అవి."

"ఎందుకూ ఇప్పుడు?"

"నాకు కావాలి"

"లేవుగా" నవ్వింది రామి నవరత్నాలు రాలిపడేట్టుగా.

"ఏమైనాయి!" జగపతి గుండెలో నీరు దిగింది.

"ఆ మరుసనాడే సుబ్బన్నకిచ్చి బస్తీకి పంపించి, మార్పించినానుగా"

"నిజమా!"

"ముమ్మాటికీ!"

జగపతి అరటిచెట్టును నరికినట్టుగా కూలిపోయాడు.

'ఎంతపని చేశావే రామీ! దుర్మార్గురాలా! ఆ పాపమంతా నీకే కొడుతుంది. నువ్వే అనుభవిస్తావు!" అన్నాడు జగపతి ఉద్రేకంగా.

రామి కంగారు పడింది.

"ఏమిటి మామా! ఏం జరిగింది? ఆనగలు మార్చగూడదా!"

"నీకు తెలీదే, రామీ! అవి కరణంగారి భార్య ఏడుకొండలవాడికి నిలువుదోపిడిగా ఇస్తానని మొక్కుకున్న నగలంట. వాటిని దొంగిలించిన వాళ్ళకూ, ఆ సొమ్మును అనుభవించినవాళ్ళకూ—పుట్టగతులు లేవంట. శ్రీవారికి ఆగ్రహం వొస్తే మానవమాత్రులం అందులో అధములం—మన మెంత! చూస్తివిగా—నా కాలికి వొచ్చిన ప్రమాదం!"

రామి రొమ్ములమీద అరచేతులు వేసుకొని భయాన్ని అణచుకుంది.

"అయితే మామా! ఆనగలు తీసికెళ్ళి, వాళ్ళింట్లోనే దిగవిడిచిరా. ఒట్టిదే! నా దగ్గరే వున్నాయి. నీతో అబద్ధమాడాను,"

అని రామి కావిడిపెట్టెలోని గోవర్ధన గొలుసూ, వొంకెల గాజులూ తీసికొచ్చి, గుడ్డ చుట్టి—జగపతి చేతిలో పెట్టింది.

జగపతి కళ్ళు ఆనందంతో మెరిశాయి.

## 4

హంతకుని ఆలోచనలావుంది అర్ధరాత్రి. చెట్లమీద నుంచి ఆకురాలినా వినిపించేంత నిశ్శబ్ద స్థితిలో, జగపతి భార్యను విడిచి—ఆ అర్ధరాత్రి వూరిబయటికి వొచ్చాడు. కేశవాయపాలానికి దారితీసే డొంకలో అడుగు పెట్టాడు.

రెక్కలు విప్పుకొని అవినీతి మనుషుల్లో నాట్యం చేసినట్టే—జడలు విరబోసుకొని చీకట్లో చెట్లు కరాళనృత్యం చేస్తున్నాయి. ఆ చీకట్లో జగపతి కేశవాయపాలెం నడిచి వెళ్ళాడు.

కరణంగారింట్లో—జొరబడ్డాడు పెరటి దొడ్డిమొండిగోడ దూకి.

వంటగదిలోంచి—ఇంటి చావడిలో ప్రవేశించాడు. గదిలోంచి వొచ్చే బెడ్ లైటు పల్చనికాంతి అస్పష్టంగా పడుతోంది. ఆకాంతి చీకటిని పారదోల లేకపోతూంది. ఆ గదితలుపు వోరగా తెరచివుంది. ఆగదిలోనే కరణంగారి భార్య, చిన్న కూతురూ, కరణంగారి తల్లీ పడుకొని వుంటారు. ఆగదిలోనే జగపతి ఆనగల్ని దొంగిలించింది.

జగపతి నెమ్మదిగా ఆగదిలోనే ప్రవేశించాడు. అతని మనస్సు అతిప్రశాంతంగా వుంది దొంగతనానికి వొచ్చినవాడి మనస్సుకు వుండే ఆవేగమూ, ఆవేశమూ, భయమూ లేవు.

మరణావస్థలో నున్నవాని మూలుగులాగ వుంది గదిలో కాంతి.

అంతా గాఢనిద్రలో ఉన్నారు.

వీధిలో కుక్క 'భౌ' అని అరిచింది ప్రాణంమీద కొచ్చినట్టుగా. వంటగదిలోని పిల్లి పాలగిన్నె దొర్లించి—పరుగెత్తింది. మంచంక్రింద గ్లాసును జగపతి చూడక తన్నాడు. గుడిలో గంట వాయించినట్టుగా చప్పుడు చేసిందది.

కరణంగారి భార్య ఉలిక్కిపడి లేచింది పీడకలవొచ్చినట్టుగా.

మసకచీకట్లో మానవాకారం కదిలినట్టుగా నిద్రకళ్ళకు తోచింది.

కెవ్వున కేక వేసింది.

"దొంగ—దొంగ!" అని వంటనే అరిచింది.

ప్రక్కగదిలో పడుకున్న కరణంగారు జారిన పంచెను చేత్తో పట్టుకొని పరుగెత్తుకొచ్చారు. భార్యాభర్త లిద్దరూ అరిచారు—'దొంగ-దొంగ' అని.

(63 వ పేజి చూడండి)



అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

**ఆంధ్ర సేఫ్ కంపెని,**

షో రూము: సరస్వతిటాకీస్ రోడ్, విజయవాడ-1.

వర్కుషాపు: మునిసిపల్ ఆఫీసురోడ్, విజయవాడ-1.

బ్రాంచి: ప్రకాశంరోడ్ - విజయవాడ-2.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణములలో సేల్సు ఏజంటు కావలెను. వివరములకు వ్రాయండి.

# ఏడుకొండలవాడా!

(28-వ పేజీతరువాయి)

చుట్టుపక్కలవాళ్లు కూడా పరుగెత్తుకొచ్చారు నిద్రమొహాలతో.

జగపతి అట్లానే నిలబడ్డాడు—శిల్లం కొట్టిన రాయిలాగ. పరుగెత్తి పారిపోవటానికి ప్రయత్నించలేదు. పట్టుబడ్డాడు.

ఆ ప్రక్కింటి వీరయ్యా, సుబ్బరామయ్య కమతగాడూ, రామచంద్రయ్యా—అంతా కూడి జగపతి చేతుల్ని కవ్వంతాడుతో గట్టిగా కట్టారు. ఊళ్ళో వున్న అవుటు పోస్టు పోలీసుస్టేషనుకు అరాత్రే తీసికెళ్ళారు జగపతిని.

"ఏడుకొండలవాడా! వెంకటారమణా! ఇది నీ చిద్విలాసమేనాస్వామీ! దొంగతనం చేద్దామని రాలేదు. కాని దొంగవొచ్చినట్టుగా నేవొచ్చాను. దొంగలాగానే పట్టుపడ్డాను. నాలో మిగిలివున్న చెడుకీ, పాపానికీ, దుర్మార్గానికీ— ఈ జైలు తగినశిక్ష. ఇదే ఆఖరు సారిగా జైలుకు వెళ్ళడం." అనుకున్నాడు జగపతి పోలీసుస్టేషనుకు నడుస్తూ.

కరణంగారి భార్యకు, వాళ్లు జగపతిని అటు తీసుకెళ్ళగానే—ద్రాయరుమీదపెట్టి వున్న గోవర్ధన గొలుసూ, వొంకెల గాజులూ శ్రీవారి మొక్కుబడి తాలూకువి అగుపించాయి. ఆవిడ ఆశ్చర్యానికి అంతులేదు. భర్తను కేక వేసింది.

"ఏమండీ! చూశారా! రెండు నెలల క్రితం దొంగలెత్తుకుపోయినగలు—యిప్పుడు యీ ద్రాయరుమీద పెట్టివున్నాయి. ఈ నగలు ఏడుకొండలవాడివి. నిలువు దోపిడీగా యిస్తానని మొక్కుకున్నవి. చూశారా! ఏడుకొండలవాడి లీలా విశేషము! మనుష్యుల్ని మనుషులు మోసం చేసుకున్నా, దొంగతనం చేసుకున్నా— ఏడుకొండలవాడు కనిపెడుతూనే వుంటాడు. మంచీ చెడూ మధ్య రత్నంలాగ నిలిచి—పరికిస్తూనే వుంటాడు. దారితప్పి నడిచేవాళ్ళను సరైనదారికి తెస్తూనే వుంటాడు. ఏడుకొండలవాడా! వెంకటారమణా! ఆపద్బాంధవా! ఆనంద స్వరూపా! భూలోకవైకుంఠ నాథా! భక్తజనపాలకా.." అంటూ కరణంగారి భార్య ఆ నగల్ని హృదయానికి గట్టిగా హత్తుకున్నది. ఆవిడ హృదయంలో ఆనందం ఉప్పొంగింది. భక్తి పారవశ్యముచే ఆవిడ శరీరం అటూ ఇటూ తూగింది.

కరణంగారు ఆనందబాష్పాలను భరించలేక—పై పంచతో కళ్ళు అద్దుకున్నారు.

ఆ ఇంట్లోని పడమటగదిలోని పూజామందిరంలోని—శ్రీవెంకటేశ్వరస్వామి..."

★

